కొత్తూరు కాలనీలో సమస్యల తిష్ట

- ప్రధాన రహదారి అధ్వానం
- తాగేందుకు పనిచేయని బోరు నీరు
- ఖాళీ స్థలాల్లో నిలిచిన మురుగునీరు

ఏలూరు రూరల్ : ఏలూరు కార్పొరేషన్‌లో విలీనమైన కొత్తూరు కాలనీలో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. అరకొర వసతులు మధ్య కాలనీలో కాలం గడుపుతున్నారు. సుమారు 15 ఏళ్ల క్రితం ఏర్పడిన కొత్తూరుకాలనీ వెంకటాపురం పంచాయతీ పరిధిలో ఉండేది. ఇది నాలుగేళ్ల క్రితం ఏలూరు కార్పొరేషన్‌లో విలీనమైంది. ఈ కాలనీలో ఐదే వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇక్కడ సరఫరా అవుతున్న బోరు నీరు ఉప్పగా ఉండడంతో అన్నం వండుకోవడానికీ కూడా పనిచేయడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు నీటితో స్నానం చేస్తే చర్మ వ్యాధులు వస్తున్నాయని వాపోతున్నారు. ప్రతి కుటుంబం రోజుకు రెండు టిన్నుల నీరు కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గోదావరి నీటిని సరఫరా చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానం

కాలనీలో వైఎస్సార్ సీపీ హయాంలో డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఐతే కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీలో మురుగు నీరు ఎగదన్ని ఖాళీ స్థలాల్లోకి చేరుతోంది. ఆయా ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోంది. వర్షాకాలంలో దోమల పెరిగి విషజ్వరాల బారిన పడుతున్నామని కాలనీ మహిళలు ఆందోళన చెందుతున్నారు.

ప్రధాన రోడ్డును అభివృద్ధి చేయాలి

వైఎస్సార్ సీపీ హయాంలో అధికారులు అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేశారు. కాలనీలో ప్రధానరోడ్డును అభివృద్ధి చేయాల్సి ఉంది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రోడ్డుపై గోతులు ఏర్పడి నడిచివెళ్లేందుకు కూడా అనుకూలంగా లేదు. నిత్యం ఉదయం ఏలూరుకు వచ్చి కాయకష్టం చేసుకుని సాయంత్రం కాలనీకి చేరుకునే కాలనీ వాసులు రోడ్డు గోతుల కారణంగా రాకపోకల సమయంలో ప్రమాదాల భారిన పడుతున్నారు. ప్రధానరోడ్డును అభివృద్ధి చేయాలని, వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



ఖాళీ స్థలంలో నిలిచిన మురుగు నీరు



వైఎస్సార్ సీపీ హయాంలో కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు



కాలనీలో సరఫరా అవుతున్న ఉప్పునీటి బోరు

గోదావరి నీరు అందించాలి



బోరు నీరు ఉప్పగా ఉండడం వల్ల తాగడానికి పని చేయడంలేదు. బోరునీరుతో అన్నం వండితే చిమిడిపోతోంది. బోరునీరు వాడకానికి మాత్రమే ఉపయోగపడుతుంది. అధికారులు గోదావరి నీరు సరఫరా చేయాలి. ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. గోదావరి నీరు తాగితే ఆరోగ్యంగా ఉంటాం.

– వరద ప్రభావతి, కాలనీవాసి

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి



వర్షాకాలంలో మా కాలనీ బురదగా మారిపోతుంది. మురుగునీరు, వర్షపునీరు కిందకు పారడం లేదు. ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు రోజుల తరబడి నిలిచిపోయి దోమలు విస్తృంభిస్తున్నాయి. చీకటి పడితే నిద్ర పోలేకపోతున్నాం. అధికారులు డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలి.

– యడ్ల లక్ష్మి, కాలనీవాసి

క్లుప్తంగా

ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బద్దా వెంకట్రావు

ఏలూరు (టూటౌన్): రైల్వే గూడ్స్‌షెడ్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు డిమాండ్ చేశారు. ఏలూరు రైల్వే గూడ్స్ షెడ్ ఆవరణలో భవిశెట్టి కేశవ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో వెంకట్రావు మాట్లాడారు. కార్మిక హక్కుల పరిరక్షణ, హమాలీల ఉపాధి భద్రతతో కూడిన చట్టం వచ్చేవరకు సమరశీల పోరాటాలకు కార్మిక వర్గం సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. అసంఘటిత కార్మిక రంగానికి పని భద్రత కల్పించే విధంగా బీమా లాంటి భద్రత సౌకర్యాలు తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఇఫ్టూ నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి గడసాల రాంబాబు, ఏపీ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణకార్మిక సంఘం నగర అధ్యక్షుడు కాకర్ల శ్రీనివాసరావు, పలువురు గూడ్స్‌షెడ్ హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

పోలీసులకు సేవా పతకాలు

ఏలూరు టౌన్: విధుల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన పోలీస్ సిబ్బంది సేవా పతకాలు అందుకున్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో స్వాతంత్ర్య సంబరాల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ చేతుల మీదుగా ఏలూరు రేంజ్ కంట్రోల్ రూమ్‌లో పని చేస్తున్న ఎస్సై ఎండీ రిజ్వాన్, డీటీసీ పెదవేగి ఎస్సై జి.కేశవరావు, ఏలూరు త్రీటౌన్ టౌన్ ఏఎస్సై కె.గోవింద రాజు, పెదవేగి హెచ్‌సీ పీఎస్వీ ప్రవీణ్, ఏలూరు డీఏఆర్ ఏఆర్ హెచ్‌సీ కేఎస్ఎన్ మూర్తి పతకాలను అందుకున్నారు.

మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి

ఏలూరు (టూటౌన్): మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యల నుంచి రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని శుక్రవారం ఒక ప్రకటనలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా ఆర్‌జీ కార్ వైద్య కళాశాల ఆసుపత్రిలో పోస్టు గ్రాడ్యుయేషన్ ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటనను తీవ్రంగా ఖండించారు. దీనికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ యంత్రాంగం దోషులను కాపాడే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏలూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ) : విజయవాడ డివిజన్ డీసీఎం (డివిజనల్ కమర్షియల్ మేనేజర్) ఎండీ అలీఖాన్ శుక్రవారం ఏలూరు రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కమర్షియల్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి ఆయన ఏలూరు స్టేషన్‌లోని బుకింగ్ కౌంటర్‌లు, క్యూ ఆర్ కోడ్‌ల ప్రదర్శన, పార్శిల్ కార్యాలయం, క్యాటరింగ్ స్టాల్స్, వాటర్ వెండింగ్ స్టాళ్లతో పాటు ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. డిజిటల్ టికెటింగ్‌ను ప్రోత్సాహించేలా ఏటీవీఎంలు సక్రమంగా పనిచేసేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ప్యాంట్రీ కార్‌ను తనిఖీ చేసి ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, గడువు తేదీలను పరిశీలించారు. అదే విధంగా వెండర్స్ లైసెన్స్ కార్డులు, మెడికల్ సర్టిఫికెట్‌లను తనిఖీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, యూనిఫాం, ఐడీ కార్డులు ధరించి ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. ఆహార విక్రయాల్లో రైల్వే బోర్డు జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్సిందిగా ప్యాంట్రీ కార్ మేనేజర్‌ను ఆదేశించారు.



ఏలూరు స్టేషన్‌లో బుకింగ్ కౌంటర్‌ల వద్ద తనిఖీ చేస్తున్న డీసీఎం ఎండీ అలీఖాన్

సామాజిక కార్యకర్త రాజుకి సత్కారం

ఏలూరు (టూటౌన్): ఉత్తమ సోషల్ సర్వీస్ సేవా రత్న అవార్డును అందుకున్న సామాజిక కార్యకర్త మల్లిపూడి రాజును జిల్లా యాదవ సంఘం నాయకులు అభినందించారు. స్థానిక ఏటిగట్టులో ఉన్న జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మంచి వ్యక్తిత్వం, మంచి కోరే స్వభావం, సమాజం జంతువుల పట్ల బాధ్యతగా భావించే గుణం వంటి కారణాలతో మల్లిపూడి రాజు ఆగస్టు 15న ఏలూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 78వ స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి కొలుసు పార్థసారథి చేతులు మీదుగా అవార్డును అందుకోవడం అభినందనీయమని అన్నారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ముమ్మడి చింతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మెరుగుమాల శ్రీనివాసరావు, కిలారపు జగదీష్, కొమ్మ నాగరాజు, చిదరబోయి శ్రీనివాస్, ఉక్కుసూరి గోపాలకృష్ణ, బొట్టా అజయ్, డొక్కు మల్లేశ్వరరావు, మేకల శ్రీరామ్ మూర్తి, కొల్లిపర నాగ శ్రీనివాసరావు, గొర్ల రామారావు, కిలారపు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



రాజును సత్కరిస్తున్న జిల్లా యాదవ సంఘం నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంకన్న చెరువు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తగూడెం సెంటర్, 7 కాలువల సెంటర్, చాటపర్రు రోడ్డు, తూర్పు వీధి సాయిబాబా గుడి సెంటర్, తూర్పువీధి గంగానమ్మ గుడి సెంటర్, ఫిల్‌హౌస్ పేట, వీవర్స్ కాలనీ, అరుంధతి పేట, పడమర వీధి దొంగల మండపం ప్రాంతం, కదకం రోడ్డు, దక్షిణపు వీధి, శనగపప్పు బజారు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

- సంతోష్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆర్ఎంఎస్ కాలనీ, డీ మార్ట్ ప్రాంతం, మంచినీళ్లతోట, చాణక్యపురి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అశోక్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని అశోక్ నగర్, అమీనాపేట, రామచంద్రరావు పేట, నరసింహారావు పేట, పత్తేబాద, కొత్తపేట, వపర్‌పేట స్టేషన్ రోడ్డు, కలెక్టర్ కార్యాలయ ప్రాంతం, జిల్లా కోర్టు సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.
- గుడివాకలంక సబ్ స్టేషన్ పరిధిలోని తిమ్మారావు గూడెం, కేడీ పురం, గుడివాక లంక, మొండికోడు, ప్రత్తికోళ్లలంక, పైడి చింతపాడు, కొక్కిరాయి లంక, కోమటిలంక, పెద్ద యాగిరిమిల్లి, చిన్న యాగిరిమిల్లి గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ నటరాజన్ తెలిపారు.

పోలీస్ కో–ఆపరేటివ్ భవనం ప్రారంభం

ఏలూరు టౌన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పోలీస్ కోఆపరేటివ్ సొసైటీని 1923లో ఏలూరు జిల్లా పోలీస్ కేంద్రంలో ఏర్పాటు చేశారు. నేడు ఏలూరు పోలీస్ పరేడ్‌గ్రౌండ్స్ ప్రాంగణంలో నిర్వహించిన సొసైటీ నూతన భవనాన్ని ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ శుక్రవారం ప్రారంభించారు. సుమారు రూ.28 లక్షల వ్యయంతో పోలీస్ సిబ్బందికి ఉపయోగపడేలా భవనాన్ని నిర్మించటం అభినందనీయమని ఆయన తెలిపారు. పోలీస్ సొసైటీలోని సభ్యులందరికీ క్రమపద్ధతిలో రుణాలను మంజూరు చేస్తూ వారికి అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ జి.స్వరూప రాణి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, ఏపీ పోలీస్ హౌసింగ్ బోర్డు డిప్యూటీ ఈఈ షేక్ అబ్దుల్ ఖాదిర్, ఏలూరు డీఎస్పీ బి.శ్రావణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్, ఏలూరు త్రీటౌన్ సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐ పవన్‌కుమార్, కోఆపరేటివ్ సొసైటీ సెక్రటరీ సత్యనారాయణ, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ శానం రమేష్‌బాబు, ఎస్సై రాంబాబు, ఆర్ఎస్ఐ నరేంద్ర తదితరులు ఉన్నారు.



పోలీస్ కో–ఆపరేటివ్ సొసైటీ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎస్పీ ప్రతాప శివకిషోర్

ప్రభుత్వ యూనివర్సిటీలను ప్రోత్సహించాలి

ఏలూరు (టూటౌన్): ప్రైవేట్ యూనివర్సిటీలను నిలిపివేసి, ప్రభుత్వ యూనివర్సిటీలను పెంచి పోషించాలని కృష్ణా, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమావేశాల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యారంగంలో అనేక లోటుపాట్లు ఉన్నాయన్నారు. వాటిని పాలకులు సరి చేయాలని కోరారు. ప్రభుత్వ యూనివర్సిటీలలో 5వేల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీ ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి మేజర్,మైనర్ సబ్జెక్టులను రద్దు చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష ,కార్యదర్శులు కె.ప్రసన్న,ఎ.అశోక్‌లు మాట్లాడుతూ జీవో నెంబరు 82 ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను పెంచాలని, పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన,వసతి దీవెన, అమ్మ ఒడి పథకాల నిధులను విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.లెనిన్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	7,10
బెండకాయలు	24	కంద	50
పచ్చిమిర్చి	38	బీట్‌రూట్	34
కాకర కాయలు	30-36	కీరా దోస	46
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	64
బీరకాయలు (పందిరి)	40	అల్లం	100-160
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	38-56	పాలకూర	10
దొండకాయలు	44	చుక్కకూర	10
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	42-44	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	24-26	బఠాణీ	--
అనపకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	17
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	09
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	13
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	22
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	14
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	18
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	06
ఏలూరు - తిరుపతి	16.00	4830	26

భార్యపై హత్యాయత్నం

ఏలూరు టౌన్ : ఏలూరులో భార్య పై హత్యాప్రయత్నానికి పాల్పడిన భర్తను ఏలూరు వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వన్ టౌన్ లంబాడీపేటకు చెందిన శివప్రసాద్, కనకదుర్గలు దంపతులు. శివప్రసాద్ తాపీ పనులు చేస్తుంటాడు. ఇతను భార్యపై గొడవపడి ఈనెల 15 రాత్రి ఆమె మెడ చుట్టూ చున్నీ బిగించి హత్య చేయబోయాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను సర్వజన ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. దీనిపై బాధితురాలు కనకదుర్గ సోదరి ఉషారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వన్ టౌన్ పోలీసులు శుక్రవారం రాత్రి శివప్రసాద్‌ను అరెస్టు చేశారు.

కరాటే శిక్షణతో ఆత్మ రక్షణకు భరోసా

భీమడోలు: కరాటే శిక్షణతో ఆత్మ రక్షణకు భరోసా లభిస్తుందని భీమడోలు అగ్నిమాపకాధికారి జి.నాగరాజు అన్నారు. భీమడోలు మాంటిస్సోరి విద్యా సంస్థల కార్యాలయంలో శుక్రవారం జపాన్ షోటోకాన్ కరాటే–డు– కన్నిన్‌జా ఆర్గనైజేషన్(ఇండియా) ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఏపీ చీఫ్ షిహాన్ డీఎల్ నారాయణ, భీమడోలు కరాటే మాస్టర్ ఎం.సతీష్‌కుమార్ పర్యవేక్షించారు. చిన్నారులు చక్కని ప్రతిభను చాటి ఎల్లో బెల్ట్, బ్లూ బెల్ట్, పర్పుల్ బెల్ట్, బ్రౌన్ బెల్ట్‌లు సాధించారు. విజేతలకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి పి.బాలు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్, ఉంగుటూరు నియోజకవర్గ కోకన్వీనర్ వెజ్జు ధార్మరావు పాల్గొని ప్రసంగించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత



దెందులూరు మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: గ్రామాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి, ఎంపీడీఓ వీ.శ్రీలత ఆదేశించారు. శుక్రవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీఓలు మాట్లాడుతూ ఏ శాఖలోనైనా మండలాధికారులు, గ్రామస్థాయి ఉద్యోగులు వారి పరిధిలో పని సక్రమంగా చేయకపోతే తద్వారా వచ్చే చెడ్డ పేరు, అన్ని శాఖల అధికారులు భరించాల్సి ఉంటుందని అన్నారు. బాధ్యతగా గ్రామస్థాయి ఉద్యోగులు వారి పరిధిలో పనులు పూర్తి చేయాలన్నారు. దెందులూరు బస్టాండ్ సెంటర్, లైబ్రరీ సెంటర్, ఉన్నత పాఠశాలతో ఇతర ప్రాంతాల్లో చెత్తను తొలగించకపోవడం, నెలలు తరబడి అక్కడ ఉండటం సరైన పద్ధతి కాదన్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ త్వరలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అన్ని గ్రామాల ప్రజలు భూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని అన్నారు. ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్, ఇతర మండల అధికారులు శాఖల వారీగా వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఈ సమావేశంలో ఏఓ భీమరాజు, మండలంలో ఎంపీటీసీలు, సర్పంచులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



బంగారు చీరలో అగ్రహారం రాజ్యలక్ష్మి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా నగరంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు చేశారు. వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మి అమ్మవారు గజలక్ష్మిగా, పత్తేబాద నాలుగు గుడుల సెంటర్‌లోని కనకదుర్గమ్మవారు లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏలూరు అగ్రహారంలోని శ్రీ జనార్దన, నగరేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారికి బంగారు చీరతో విశేష అలంకరణ చేశారు. ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ముత్తైదువులు తమ ఇళ్ల వద్ద వరలక్ష్మి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఫ్రైడే డ్రై డే ర్యాలీలు

ఏలూరు రూరల్ : వర్షాకాలంలో మలేరియా జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జి.గోవిందరావు అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక పీహెచ్‌సీ అధికారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది గుడివాకలంక, మానూరు, మహేశ్వరపురం తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోజుల తరబడి నీరు నిలిచి ఉంటే దోమల వ్యాప్తి చెంది అనారోగ్యపాలౌతామని వివరించారు. దోమతెరల వాడడం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు.

18న ధ్యాన విజయోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి ఇంటా ఆనందాన్ని పంచాలనే లక్ష్యంతో ధ్యాన ప్రచారాన్ని ప్రారంభించి 108 సప్తాహాలు పూర్తి చేసిన సందర్భంగా నగరంలో ఈ నెల 18వ తేదీన ధ్యాన విజయోత్సవం నిర్వహించనున్నట్టు ఏలూరు పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ అధ్యక్షుడు మాజేటి శేషగిరిరావు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి కళ్యాణ మండపంలో ధ్యాన విజయోత్సవం నిరంతరాయంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్‌కు ఎమ్మెల్యే నెల జీతం విరాళం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో అన్న క్యాంటీన్ల నిర్వహణకు తన వంతు బాధ్యతగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తన ఒక నెల జీతం రూ.1.50 లక్షలను సంబంధిత అధికారులకు అందజేశారు. స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం వెనుక ఉన్న అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం సందర్భంగా చెక్కును అందించారు. కార్యక్రమంలో ఎస్ఎంఆర్ పెదబాబు, దాసరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బిషప్ జాన్ ములగడ సేవలు చిరస్మరణీయం

దెందులూరు: కోస్తా జిల్లాల్లో ఆదర్శవంతమైన ఆధ్యాత్మిక సేవలను ఆర్‌సీఎం ఏలూరు పీఠం తొలి బిషప్ జాన్ ములగడ అందించారని ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పి.బాల అన్నారు. శుక్రవారం సోమవరప్పాడు సెయింట్ జాన్స్ బీఈడీ విద్యా సంస్థల్లో బిషప్ జాన్ ములగడ 15వ వర్ధంతిని నిర్వహించారు. తొలుత వికార్ ఫోరెన్ వింజేపాల్ , వికార్ జనరల్ బాల తదితరులు జాన్ ములగడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిషప్ జాన్ ములగడ కోస్తా జిల్లాల్లో ఆధ్యాత్మిక సేవను, సువార్త ప్రకటనను క్షేత్రస్థాయిలో అందివ్వడం, విద్యా, వైద్య, మౌలికవసతుల కల్పన, ప్రాథమిక నిర్మూలన, యువత, మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ, గృహనిర్మాణంలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, భారత ప్రధాని సైతం ప్రశంసించిన సంగతి విదితమే. ఆధ్యాత్మిక రంగంలో బిషప్ జాన్ ములగడ సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది సాల్మన్‌రాజు, జోజిబాబు, సుందరి, అన్నారావు, రాజ్‌కుమార్, ప్రసాద్, రమణ ఉన్నారు.